సాక్షి
అనకాపల్లి

గురువారం । 12 । జనవరి । 2023

చిరు వ్యాపారులకు తోడు నీడ

- లబ్ధిదారులకు ఆరో విడత ఆర్థిక సహాయం
- జిల్లాలో 12,964 మందికి రూ.12.96 కోట్ల జగనన్న తోడు
- 20,441 మంది తీసుకున్న రుణాలకు రూ.34.12 లక్షల వడ్డీ జమ



లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, జేసీ కల్పనాకుమారి, డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి

సాక్షి, అనకాపల్లి: చిరు వ్యాపారస్తులు, సంప్రదాయ కళాకారులు, తోపుడు బండ్లపై వ్యాపారాలు చేసుకునే వారికి 'జగనన్న తోడు' పథకం అండగా నిలుస్తోంది. ఇప్పటికే ఐదు విడతల్లో వారికి రూ.10 వేల చొప్పున జీరో వడ్డీ రుణాలు అందజేశారు. ఈ ఏడాదికిగానూ ఆరో విడత ఆర్థిక సాయాన్ని కూడా బుధవారం ఉదయం తాడేపల్లి క్యాంప్ కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బటన్ నొక్కి విడుదల చేశారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, జాయింట్ కలెక్టర్ కల్పనాకుమారి, డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి చేతుల మీదుగా లబ్ధిదారులకు ఆరో విడత చెక్కులను పంపిణీ చేశారు. జిల్లాలో 'జగనన్న తోడు' పథకంలో భాగంగా ఆరో విడతలో 12,964 మంది లబ్ధిదారులకు రూ.12.96 కోట్లను విడుదల చేశారు. గత మూడున్నరేళ్లలో ఐదు విడతల్లో జిల్లాలో 94,597 మందికి రూ.97.01 కోట్ల రుణాలు మంజూరు చేశారు. ఆరో విడతతో కలిపి ఇప్పటివరకు జిల్లాలో 1,07,561మందికి రూ.109.97 కోట్ల సాయం చేశారు. గతంలో రుణం తీసుకొని తిరిగి చెల్లించిన 20,441మంది బ్యాంకు ఖాతాలకు 34 లక్షల 12 వేల 646 రూపాయల వడ్డీ రాయితీని ప్రభుత్వం విడుదల చేసింది.

చిరువ్యాపారస్తులకు ఎంతో మేలు: కలెక్టర్

గతంలో రోజువారీ వడ్డీ రుణాలతో చిరు వ్యాపారస్తులు, తోపుడుబళ్లవారు, సంప్రదాయ వృత్తిదారులు చాలా ఇబ్బందులకు గురయ్యేవారని, ఇప్పుడు అలాంటి బాధ లేకుండా 'జగనన్న తోడు' పథకం వారికి ఎంతో మేలు చేస్తోందని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అన్నారు. సున్నా వడ్డీతో ఏడాదికి రెండు విడతలుగా ప్రభుత్వం అందించే రుణాలు వారి వ్యాపార అభివృద్ధికి దోహదపడతాయన్నారు. లబ్ధిదారులు సకాలంలో బ్యాంకులకు తిరిగి చెల్లించాలని, అర్హులైన వారు ఇంకా ఎవరైనా ఉంటే వారు కూడా సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. బుట్టల్లో సరుకులు అమ్మేవారు, ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు చేసేవారు, సైకిల్, వాహనాలపై వస్తువులు అమ్మేవారు, కొండపల్లి, ఏటికొప్పాక కొయ్యబొమ్మల వంటి సంప్రదాయ హస్తకళలపై ఆధారపడే వారు ఈ పథకం



నక్కపల్లి కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో భోగి మంట చుట్టూ నృత్యం చేస్తున్న విద్యార్థినులు

సంబరాల సంక్రాంతి

సంక్రాంతి అంటేనే సందడి. గ్రామీణులు ఎంతో వేడుకగా చేసుకునే పర్వదినం. ఆ సంబరాల అనుభూతిని నేటి తరం పిల్లలకు పరిచయం చేయడానికి బుధవారం పలు ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో సంక్రాంతి పండగ జరిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు సంప్రదాయ దుస్తులు ధరించి ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ముత్యాలముగ్గులు, భోగి మంటలు, హరిదాసు, డూడూబసవన్నల సందడి, బొమ్మలకొలువు.. ఇలా పల్లె వాతావరణం కళ్లకు కట్టేలా కార్యక్రమాలు నిర్వహించారు. అందరూ ఉత్సాహంగా పాల్గొన్నారు.

–సాక్షి న్యూస్ నెట్‌వర్క్



పాయకరావుపేటలోని ఒక ప్రైవేటు విద్యాసంస్థలో బొమ్మలకొలువు



అనకాపల్లి మండలం కొత్తతలారివానిపాలెం ఎంపీపీ పాఠశాలలో హరిదాసు వేషధారికి బియ్యం వేస్తున్న బాలికలు

న్యూస్‌రీల్

'వందే భారత్' పరుగులు




సమయం.. బుధవారం ఉదయం 11.30 గంటల ప్రాంతం.. గుండెల్లో రైళ్లు పరిగెత్తించేలా 'వందే భారత్' అనకాపల్లి రైల్వే స్టేషన్ మీదుగా విశాఖ వైపు దూసుకుపోయింది. దేశంలోనే అత్యంత **వేగంగా 160 కి.మీ.** స్పీడ్‌తో నడిచే ఈ రైలును **త్వరలో సికింద్రాబాద్‌-విశాఖపట్నం మధ్య ప్రారంభించను**న్నారు. బుధవారం **ట్రయల్ రన్ నిర్వహిం**చారు. **- అనకాపల్లి టౌన్**

కోడిపందాలపై ఉక్కుపాదం

- జూద స్థావరాలపై పటిష్ట నిఘా
- ఎస్పీ గౌతమి సాలి హెచ్చరిక

అనకాపల్లి టౌన్: కోడిపందాలు, జూదం, అసాంఘిక కార్యకలాపాలపై దృష్టి సారించినట్టు ఎస్పీ గౌతమి సాలి అన్నారు. తన కార్యాలయంలో బుధవారం ఆమె మీడియాతో మాట్లాడారు. జిల్లాలో సంక్రాంతి సందర్భంగా ఇలాంటివేవీ జరగకుండా ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. గతంలో ఏఏ ప్రాంతాల్లో కోడిపందాలు నిర్వహించారో ఆ ప్రాంతాలను ఇప్పటికే గుర్తించామని చెప్పారు. గతంలో పందాలు ఆడుతూ పట్టుబడిన వారు మళ్లీ పాల్గొంటే బైండోవర్ చేస్తామన్నారు. అయినా తీరు మారకుంటే అటువంటి వారిని న్యాయస్థానంలో హాజరు పరిచి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామస్తులు కోడి పందాల నిర్వహణపై తమకు సహకరించాలని కోరారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా 100కు గానీ, 9346912724 వాట్సాప్ నంబరుకు గానీ వివరాలు అందించాలని ఆమె కోరారు.

గుండెపోటుతో ఎంపీడీవో చంద్రశేఖర్ మృతి



ఎంపీడీవో చంద్రశేఖర్ భౌతికకాయాన్ని సందర్శించిన మంత్రి అమర్‌నాథ్

అనకాపల్లి టౌన్: ఎంపీడీవో చంద్రశేఖర్ గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు. సింహాచలం శ్రీనివాసనగర్‌కాలనీలో నివాసముంటున్న చంద్రశేఖర్‌కు ఛాతీనొప్పి రావడంతో మంగళవారం రాత్రి కుటుంబసభ్యులు విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన మృతి చెందారు. మంత్రి గుడివాడ అమర్‌నాథ్ బుధవారం ఆస్పత్రికి వెళ్లి చంద్రశేఖర్ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

జాతీయ యువజనోత్సవాలు ప్రత్యక్ష ప్రసారం

తుమ్మపాల: స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని ఈ నెల 12 నుంచి 16 వరకు జాతీయ యువజనోత్సవాలు నిర్వహిస్తున్నట్టు సెట్విన్ సీఈవో పి.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధాని నరేంద్రమోదీ కర్ణాటకలో ఈ ఉత్సవాలను గురువారం సాయంత్రం ప్రారంభిస్తారని, ఈ కార్యక్రమాన్ని పీఎం.ఇండియా.వెబ్‌కాస్ట్.ఇన్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేస్తారని చెప్పారు. సాయంత్రం 4 గంటల నుంచి 5.15 గంటల వరకు ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించడానికి జిల్లాలోని అన్ని యూత్ క్లబ్‌లు, యువజన సంఘాలు, విద్యా సంస్థలు భాగస్వామ్యం కావాలని కోరారు.



బంగారం.. భారతదేశంలో దీని ఉత్పత్తి తక్కువైనా.. వినియోగంలో మాత్రం చైనా తర్వాత మనమే. ఉత్పత్తిలో ప్రపంచంలో 60వ స్థానంలో ఉన్న మనం, వినియోగంలో రెండో స్థానంలో ఉన్నాం. మనవారికి బంగారంపై ఎంత మక్కువో.. ఈ గణాంకాలు చాలు. అలంకరణతోపాటు, పెట్టుబడి సాధనంగా కూడా బంగారాన్ని ఎక్కువగా కొనుగోలు చేస్తుంటాం. దీన్ని ఆసరాగా తీసుకునే అడ్డదారుల్లో బంగారాన్ని దిగుమతి చేసుకుని, భారీ స్థాయిలో లాభాలార్జించేందుకు కొందరు వ్యాపారులు స్మగ్లింగ్ ముఠాలతో చేతులు కలుపుతున్నారు. విమానాశ్రయాల్లో ఆధునిక సాంకేతిక పరికరాలతో తనిఖీలు ముమ్మరంగా చేస్తుండటంతో కొత్త దారులు వెతుక్కున్నారు. విదేశాల నుంచి వయా కోల్‌కతా మీదుగా విశాఖ వ్యాపారుల చేతికి చేరుతున్న బంగారం స్మగ్లింగ్ తీరు అధికారుల్ని ఆశ్చర్యానికి గురిచేస్తోంది.



బంగారం స్మగ్లింగ్ నయా మార్గ్!

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం :

- గోల్డ్ స్మగ్లింగ్ వయా బంగ్లాదేశ్ టు కోల్‌కతా
- అక్కడే కరిగించి బంగారు కడ్డీలుగా మారుస్తున్న స్మగ్లర్లు
- కోల్‌కతా నుంచి విశాఖకు సరఫరా.. స్థానిక వ్యాపారులకు విక్రయం

బంగారం స్మగ్లింగ్ రూటు మారింది. అటు చెన్నై, ఇటు హైదరాబాద్ విమానాశ్రయాల్లో నిఘా పెరిగి భారీగా బంగారం పట్టుబడుతుండటంతో స్మగ్లర్లు తమ రూటు కాస్తా మార్చారు. దుబాయ్ నుంచి బంగ్లాదేశ్‌కు.. అక్కడి నుంచి కోల్‌కతాకు తరలిస్తున్నట్టు సమాచారం. కోల్‌కతాలో విదేశీ బంగారం మార్కింగ్‌ను కాస్తా తొలగించి, అక్కడి నుంచి రోడ్డు మార్గంలో విశాఖపట్నానికి తరలిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ వ్యవహారంలో కోల్‌కతాలోని స్మగ్లింగ్ ముఠాతో పాటు విశాఖలోని కొందరు బంగారు వ్యాపారస్తులు కూడా చేతులు కలిపినట్టు తెలుస్తోంది. తక్కువ ధరకే బంగారం దొరుకుతుండటంతో పాటు ఎటువంటి పన్నులు లేకుండానే వ్యాపారం చేసుకునే వీలుండటంతో రోజురోజుకీ స్మగ్లింగ్ వ్యవహారం పెరుగుతున్నట్టు సమాచారం. తాజాగా రూ.1.07 కోట్ల విలువైన 1.86 కేజీల బంగారాన్ని కోల్‌కతా నుంచి తరలిస్తుండగా డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటలిజెన్స్ (డీఆర్‌ఐ) అధికారులు తాజాగా విశాఖ రైల్వే స్టేషన్‌లో పట్టుకున్నారు. గతంలోనూ ఏకంగా 30 కేజీల బంగారాన్ని ఇదే తరహాలో పట్టుకున్నారు. బంగారంపై కేంద్రం కస్టమ్స్ డ్యూటీని 7.5 శాతం నుంచి 12.5 శాతానికి పెంచడంతో పాటు అదనంగా 2.5 శాతం వ్యవసాయ మౌలిక సదుపాయాల సెస్‌ను విధిస్తుండటంతో బంగారం స్మగ్లింగ్ పెరుగుతున్నట్టు డీఆర్‌ఐ అధికారులు భావిస్తున్నారు. విమానాశ్రయాల్లో నిఘా పెరగడంతో బంగ్లాదేశ్ తీరానికి ఆనుకొని ఉన్న పశ్చిమబెంగాల్‌కు తరలించే మార్గాన్ని స్మగ్లర్లు ఎంచుకున్నట్టు తెలుస్తోంది.

మయన్మార్ టు బంగ్లాదేశ్..!

వాస్తవానికి బంగారం స్మగ్లింగ్ వ్యవహారం అరబ్ దేశాల నుంచి జరుగుతోంది. అరబ్ నుంచి మయన్మార్‌కు, అక్కడ నుంచి బంగ్లాదేశ్‌కు సులువుగా చేరుస్తున్నారు. బంగ్లాదేశ్‌తో పశ్చిమబెంగాల్‌కు సువిశాల తీరప్రాంతం ఉంది. ఇక్కడ అనునిత్యం గస్తీ చేయడం కూడా కష్టసాధ్యంగా ఉంటోంది. సులభంగా చిన్న చిన్న ప్యాకెట్ల రూపంలో బంగారం ఎక్కువగా చేతులు మారుతోంది. అందుకే ఈ మార్గాన్ని స్మగ్లర్లు ఎన్నుకున్నట్టు డీఆర్‌ఐ అధికారులు అంచనా వేశారు. **స్థానికులు కూడా ఈ బంగారం స్మగ్లింగ్ వ్యవహారంలో ఉపాధి పొందడంతో పాటు భారీగా డబ్బును ఆర్జించడంతో వారికి సహకరిస్తున్నట్టు** డీఆర్‌ఐ అధికారుల ప్రాథమిక విచారణలో తేలింది. భారత్ దాదాపు రూ.2 లక్షల కోట్ల విలువైన బంగారాన్ని ఏటా దిగుమతి చేసుకుంటుంది. డీఆర్‌ఐ అధికారుల అంచనాల ప్రకారమే 2019–20ల్లో 120 టన్నుల బంగారం స్మగ్లింగ్ జరిగింది. వాస్తవానికి 500 గ్రాముల బిస్కెట్‌ను రవాణా చేస్తే 3.5 లక్షల మేర లాభాన్ని ఆర్జించే అవకాశం ఉందని తెలుస్తోంది.

కోల్‌కతా కేంద్రంగా..!

విదేశాల నుంచి వచ్చే బంగారానికి అక్కడి **అధికారిక ముద్ర(సీల్)** ఉంటుంది. కోల్‌కతాలో **దీన్ని కరిగిస్తున్నారు.** ఆ తర్వాత బంగారం **పీసులు, బార్లుగా** వివిధ రూపాల్లో **మారుస్తున్నారు. ఈ వ్యవహారమంతా కోల్‌కతాకు చెందిన బంగారం** స్మగ్లర్లు చేస్తున్నారు. **అక్కడి నుంచి వివిధ మార్గాల్లో** బంగారాన్ని **తరలిస్తున్నారు. బోస్, ఆద్య..** ఇలా వివిధ **మారు పేర్లతో ఉన్న కో**ల్‌కతా బంగారం **స్మగ్లర్లు ఈ వ్యవహారాలు** నిర్వహిస్తున్నట్టు **సమాచారం. ఈ వ్యవహారా**ల్లో ఆదాయం దండిగా ఉండటంతో స్థానికులు స్మగ్లర్లకు బాగా సహకరిస్తున్నట్టు డీఆర్‌ఐ అధికారులు పేర్కొంటున్నారు. కోల్‌కత్తా నుంచి విశాఖకు రోడ్డు, రైల్వే మార్గంలో ఈ అక్రమ బంగారాన్ని తరలిస్తున్నారు. అక్కడి నుంచి వచ్చిన స్మగ్లింగ్ బంగారాన్ని విశాఖలోని కొందరు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నట్టు తెలుస్తోంది.

విశాఖ వ్యాపారులకూ లింకులు!

ఉత్తరాంధ్రతో పాటు తూర్పు గోదావరి జిల్లాల ప్రజలు బంగారం కొనుగోలుకు విశాఖపట్నం కేంద్రంగా ఉంది. ఇక్కడ బంగారం వ్యాపారం భారీగా జరుగుతోంది. ఇక్కడ కొద్ది మంది బంగారం వ్యాపారులు కూడా ఈ స్మగ్లింగ్ బంగారాన్ని విక్రయిస్తున్నట్టు ఆరోపణలున్నాయి. సులభంగా తక్కువ ధరకే బంగారం దొరుకుతుండటంతో పాటు ఎటువంటి పన్నులు లేకుండా వ్యాపారం చేసుకునే వీలుండటంతో స్మగ్లర్లతో వీరు చేతులు కలిపినట్టు తెలుస్తోంది. ఈ వ్యవహారంపై కూడా డీఆర్‌ఐ అధికారులు ఆరా తీస్తున్నట్టు సమాచారం. డీఆర్‌ఐ దర్యాప్తులో మరిన్ని విషయాలు బయటపడే అవకాశం ఉంది.

నేటి నుంచి అరకు 'ఇన్‌స్టెంట్' ఘుమఘుమలు

- 50, 100 గ్రాముల టిన్స్‌లో లభ్యం
- ఈ నెలాఖరు నాటికి బ్లెండెడ్ సాచెట్స్



విడుదలకు సిద్ధమైన ఇన్‌స్టెంట్ కాఫీ టిన్స్

సాక్షి, విశాఖపట్నం: అంతర్జాతీయ కాఫీ మార్కెట్లో తనకంటూ ప్రత్యేకతను సంతరించుకున్న అరకు కాఫీ నుంచి ఇన్‌స్టెంట్ కాఫీ ఘుమఘుమలు మూడేళ్ల విరామం తర్వాత మార్కెట్‌లో పలకరించనున్నాయి. ఇప్పటికే గిరిజనుల నుంచి 10 శాతం కంటే తక్కువ తేమ ఉన్న కాఫీ పండ్లను సేకరించి, మంచి రుచితో పాటు, సువాసన తోడయ్యేలా రోస్టింగ్, ఇతర ప్రక్రియలతో ఇన్‌స్టెంట్ కాఫీ పౌడర్‌గా మార్చారు. తొలి విడతగా.. టిన్స్‌ని మార్కెట్‌లో గురువారం నుంచి విక్రయించేందుకు గిరిజన సహకార సంస్థ(జీసీసీ) ఏర్పాట్లు చేసింది. మొత్తం మూడు రకాలుగా ఇన్‌స్టెంట్ కాఫీ రుచులు వినియోగదారులకు పరిచయం చేస్తున్నట్టు జీసీసీ ఎండీ సురేష్‌కుమార్ తెలిపారు. తొలి దశలో 100 శాతం ప్యూర్ ఇన్‌స్టెంట్ కాఫీ రుచిని 50 గ్రాములు, 100 గ్రాముల టిన్స్ రూపంలో మార్కెట్‌లోకి విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు. మొత్తం 20 వేల టిన్నుల్ని సిద్ధం చేశామని, గురువారం ఉదయానికి విశాఖ మార్కెట్లోకి విడుదల చేయనున్నట్లు తెలిపారు. 60–40 బ్లెండెడ్ కాఫీ, 2 గ్రాములు, 10 గ్రాముల సాచెట్స్ రూపంలో ఈ నెలాఖరున గిరిజన శాఖ మంత్రి పీడిక రాజన్నదొర, జీసీసీ చైర్‌పర్సన్ శోభ స్వాతిరాణి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. గిరిజనులకు లాభాల్ని అందించేలా జీసీసీ ప్రతి నిర్ణయం తీసుకుంటోందని గిరిజన సహకార సంస్థ చైర్‌పర్సన్ శోభ స్వాతిరాణి స్పష్టం చేశారు.

రంగురాళ్ల తవ్వకాలపై డేగ కన్ను


- బేస్ క్యాంపులు, స్ట్రైకింగ్ ఫోర్స్‌తో పర్యవేక్షణ
- చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు

నర్సీపట్నం: పండగల పేరుతో రంగురాళ్ల తవ్వకాలకు ఆస్కారం ఉండడంతో అటవీశాఖ ముందుగా అప్రమత్తమైంది. ఇప్పటికే తవ్వకాలు జరిగిన ప్రాంతాలను గుర్తించి వాటిపై ప్రత్యేక నిఘాకు చర్యలు తీసుకుంది. బేస్‌క్యాంపుల నిర్వహణ, నిత్యం పర్యవేక్షణకు స్ట్రైకింగ్ ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. దీనిని అతిక్రమించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకునేందుకు రంగం సిద్ధం చేసింది. అత్యంత విలువైన వైఢూర్యాలు లభించే గొలుగొండ మండలం అటవీ ప్రాంతంపై ఇటీవల రంగురాళ్ల వ్యాపారుల కన్ను పడింది. ఆరిల్లోవ అటవీ ప్రాంతంలో రెండు వారాల కిందట తవ్వకాలు సాగించారు. ఈ సంఘటనతో అటవీ అధికారులు అప్రమత్తమయ్యారు. కరక, సాలికమల్లవరం, ఆరిల్లోవ అటవీ ప్రాంతాల్లోని రంగురాళ్ల క్వారీల వద్ద భద్రత కట్టుదిట్టం చేశారు. రంగురాళ్ల తవ్వకాలకు పాల్పడిన వారిపై ఇప్పటికే అటవీ అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు.

గొలుగొండ మండలంలో 1250 హెక్టార్ల విస్తీర్ణం కలిగిన అటవీ ప్రాంతాన్ని కాపాడేందుకు అటవీశాఖ అధికారులు, సిబ్బంది శ్రమిస్తున్నారు. 2005లో కరక కొండపై రంగురాళ్ల తవ్వకాలు ముమ్మరంగా సాగేవి. అదే ఏడాది జనవరిలో కరక క్వారీ కూలి ఇద్దరు మృతి చెందగా...కొంత మంది గాయపడ్డారు. దీంతో క్వారీని మూయించి నిరంతరం గస్తీలో భాగంగా ఏర్పాటు చేసిన బేస్‌క్యాంప్ నేటికీ నడుస్తోంది. పక్కాగా పహారా ఉన్నా 2021 ఆగస్టు 20వ తేదీన కొందరు కరక కొండపై తవ్వకాలకు సిద్ధమయ్యారు. విషయం తెలియడంతో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది అప్రమత్తమయ్యారు. తవ్వకాలకు మాటువేసి ఉన్న ఒకరిని అదుపులోకి తీసుకుని విచారించగా రంగురాళ్ల తవ్వకాలకు సహకరించిన వ్యక్తి డీఎఫ్‌వో వద్ద అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న కారు డ్రైవర్ కావడంతో అధికారులు విస్తుపోయారు. దీంతో అటవీ అధికారులు క్వారీ ప్రాంతంలో భద్రత మరింత కట్టుదిట్టం చేశారు. క్వారీల్లో లభ్యమయ్యే అలెక్స్ రకం రంగురాళ్లకు గిరాకీ ఉంది. ఇవి నాణ్యమైన వజ్రాల మాదిరిగానే ఉంటాయి. కోట్ల రూపాయల్లో ధర పలుకుతాయి. ఇంతటి విలువ ఉన్నందునే స్మగ్లర్లు వీటికోసం తరచూ ప్రయత్నిస్తున్నారు. ఆరిల్లోవ అటవీ ప్రాంతంలో తవ్వకాలు జరుగుతున్నట్టు వచ్చిన సమాచారం మేరకు అటవీ సిబ్బంది దాడులు నిర్వహించారు. సిబ్బందిపై రాళ్లు రువ్వి తవ్వకందారులు తప్పించుకున్నారు. రేంజర్ లక్ష్మీనర్సు లోతుగా విచారణ చేసి ఇద్దరు వ్యాపారులు పైల ప్రసాద్, పత్తి గోవింద్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. తవ్వకాలు జరిపించిన మేస్త్రీలు, కూలీలతో కలిపి 27 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశారు. ఎప్పుడూ కూలీలనే అరెస్టు చేసే అధికారులు ఈసారి వ్యాపారులను సైతం వదిలిపెట్టలేదు. ఈ తవ్వకాల వెనుక పత్రికా విలేకరులు, మరో ఇద్దరు బడా వ్యాపారుల హస్తం ఉండడంతో అటవీ అధికారులు ఆ దిశగా విచారణ చేస్తున్నట్లు తెలిసింది. క్వారీని పరిశీలించిన సీసీఎఫ్ శ్రీనాధరెడ్డి ఆదేశాల మేరకు క్వారీ వద్ద బేస్ క్యాంపు ఏర్పాటు చేసి నిఘా కట్టుదిట్టం చేశారు.



ఆరిల్లోవ రంగురాళ్ల క్వారీ వద్ద ఏర్పాటు చేసిన బేస్ క్యాంపు



కరక, ఆరిల్లోవ ప్రాంతంలో లభించే రంగురాళ్లు

భద్రత కట్టుదిట్టం...



ఆరిల్లోవ, కరక క్వారీపై మరింత నిఘా ఉంచుతున్నాం. రాత్రింబవళ్లు సిబ్బందిని నియమించాం. రిజర్వ్‌ఫారెస్టులో ప్రవేశం నిషిద్ధం. అనుమతి లేకుండా ఎవరూ ప్రవేశించకూడదు. చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవు. ఆరిల్లోవ రంగురాళ్ల తవ్వకాల్లో ఇప్పటికే వ్యాపారులను అరెస్టు చేశాం. ఆరిల్లోవ ఘటనపై రేంజర్‌చే లోతుగా విచారణ చేయిస్తున్నాం. తవ్వకాల వెనుక ఎవరు ప్రమేయం ఉన్నా వదిలిపెట్టే ప్రసక్తిలేదు. ఆ ప్రాంతాల్లో ఉన్న వ్యక్తులు తవ్వకాలకు పాల్పడితే ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాలను రద్దు చేస్తాం. చట్టాలను అతిక్రమిస్తే నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేస్తాం.

–బి.రాజారావు, డీఎఫ్‌వో, నర్సీపట్నం

శతాధిక వృద్ధురాలికి సన్మానం





సన్యాసమ్మను సత్కరిస్తున్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ (పక్కన) కార్యక్రమానికి నడుచుకుంటూ వస్తున్న సన్యాసమ్మ

బుచ్చెయ్యపేట: పోలేపల్లి గ్రామానికి చెందిన 110 సంవత్సరాల తేగాడ సన్యాసమ్మను గ్రామస్తులు సత్కరించారు. ఆమెకు ఐదుగురు కొడుకులు. ముగ్గురు కుమార్తెలు. ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు మృతి చెందారు. మనుమలు, వారి పిల్లలు మొత్తం నాలుగు తరాలకు చెందిన 60 మంది కుటుంబ సభ్యులున్నారు.

ఈ వయసులో కూడా ఆమె సంపూర్ణ ఆరోగ్యంతో తన పనులు తాను చేసుకుంటోందని గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపారు. బుధవారం గ్రామానికి వచ్చిన ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ సమక్షంలో సంక్రాంతి సందర్భంగా ఆమెకు శాలువా కప్పి సత్కరించారు. సర్పంచ్ సీతా పైడినాయుడు, ఎంపీటీసీ సీతా వరలక్ష్మి, మాజీ ఎంపీటీసీ సీతా రాము తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నర్సీపట్నం ఆర్డీవోగా జయరాం



నర్సీపట్నం: నర్సీపట్నం ఆర్డీవోగా జయరాంను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుత ఆర్డీవో భవానీ శంకర్‌కు అమరావతి సీఎంవో కార్యాలయానికి బదిలీ అయింది. ఇప్పటికే ఈ ఇద్దరు అధికారులు రెండుసార్లు అటు ఇటు మారారు. మళ్లీ నెలరోజులు తిరగకుండానే యథావిధిగా వారి వారి స్థానాలకు బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రెండు రోజుల్లో జయరాం బాధ్యతలు చేపట్టే అవకాశం ఉందని కార్యాలయ అధికారులు తెలిపారు.

గంజాయితో తమిళనాడు మహిళ అరెస్టు

నర్సీపట్నం : గంజాయి తీసుకువెళ్తున్న మహిళను నర్సీపట్నం రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. ఎస్‌ఐ ఎం.రామారావు అందించిన వివరాలివి. సిబ్బందితో కలిసి బుధవారం నెల్లిమెట్ట వద్ద వాహన తనిఖీలు చేస్తుండగా బస్సులో నుంచి ఓ మహిళ దిగి పరారవ్వాలని ప్రయత్నించింది. దీంతో ఆమెను పోలీసులు అదుపులోకి తీసుకుని బ్యాగ్ తనిఖీ చేయగా నాలుగు కిలోల గంజాయి దొరికింది. తమిళనాడు రాష్ట్రం కంపకల్లపల్లికి చెందిన విజయ్ కనుఖన్(52) చింతపల్లి మండలం, రాజుపాకల గ్రామంలో గంజాయి కొనుక్కొని తీసుకు వస్తుండగా పోలీసులకు పట్టుబడింది. ఆమె వద్ద నుండి కీ ప్యాడ్ సెల్, రూ.15,670 నగదు సీజ్ చేసి, ఆమెను రిమాండ్‌కు తరలించారు.

కాకినాడ పాసింజర్ నేడు రద్దు

తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): కాకినాడ–విశాఖపట్నం–కాకినాడ (మెము 17267/17268) ఎక్స్‌ప్రెస్‌ను వివిధ కారణాల వల్ల జనవరి 12న రద్దు చేస్తున్నామని వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం ఎ.కె. త్రిపాఠి తెలిపారు.

కొల్లాం స్పెషల్ మరో ట్రిప్పు పొడిగింపు

విశాఖపట్నం–కొల్లాం–విశాఖపట్నం (08567/08568)మధ్య నడుస్తున్న స్పెషల్ రైలును మరో ట్రిప్పు పొడిగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. విశాఖపట్నం–కొల్లాం (08567) రైలు విశాఖపట్నంలో ఆదివారం జనవరి 22వ తేదీన బయల్దేరుతుందని, తిరుగు ప్రయాణంలో కొల్లాం–విశాఖపట్నం (08568) స్పెషల్ రైలు కొల్లాంలో జనవరి 23వ తేదీ సోమవారం బయల్దేరుతుందని తెలియజేశారు.

శేషతల్ప వాహనంపై సర్వాంతర్యామి



శేషతల్పవాహనంలో ఊరేగుతున్న స్వామివారు



వైకుంఠవాసునిగా దర్శనమిస్తున్న వేంకటేశ్వరస్వామి



పుష్పతోటలో అమ్మవారికి నీరాట్టోత్సవాలు నిర్వహిస్తున్న అర్చకులు

- ఉపమాకలో ఘనంగా తిరువీధి సేవలు

నక్కపల్లి: ప్రాచీనపుణ్యక్షేత్రం ఉపమాకలో ధనుర్మాస అధ్యయనోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. గరుడాద్రిపై కల్కి అవతారంలో వెలసిన స్వామివారికి బుధవారం నిత్యార్చనలు అభిషేకాలు జరిపారు. దిగువన క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామికి, ఆండాళ్లమ్మవారి సన్నిధిలో ఉత్సవ మూర్తులకు నిత్యకార్యక్రమాలు నిర్వహించారు. భూదేవీ, శ్రీదేవీ సమేత వేంకటేశ్వరస్వామి వారిని శేషతల్పవాహనంపై, గోదాదేవి అమ్మవారిని పల్లకిలోను ఉంచి తిరువీధి సేవలు నిర్వహించారు. అనంతరం గోదాదేవి అమ్మవారి నీరాట్టోత్సవాల్లో భాగంగా స్వామివారి పుష్పతోటలో అమ్మవారికి పూజలు జరిపారు. ధూపదీప నైవేద్యాలు, నీరాజన మంత్ర పుష్పాలు, తీర్థగోష్టి, ప్రసాద వినియోగం నిర్వహించారు. అనంతరం గోదాదేవీ అమ్మవారి సన్నిధిలో తిరుప్పావై 27వ పాశురాన్ని విన్నపం చేశారు. రాపత్తు అధ్యయనోత్సవాల్లో భాగంగా పదోరోజు బుధవారం రాత్రి స్వామివారి ఉత్సవమూర్తిని వైకుంఠవాసునిగా అలంకరించారు. పుణ్యకోటి వాహనంలో అధిష్టింపజేశారు. స్వామివారి వాహనం ఎదురుగా నమ్మాళ్వార్, రామానుజుల వారి ఉత్సవమూర్తులను అధిష్టింపజేసి తిరువీధి సేవ నిర్వహించారు. అనంతరం ఆలయంలో శ్రీనమ్మాళ్వార్ వారి పరమపద ఉత్సవ కార్యక్రమం, నారాయణ సేవాకాలం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక ప్రసాదం నివేదన, తీర్థగోష్టి జరిపారు. స్వామివారిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాలనుంచి భక్తులు తరలివచ్చారు.

బోన్‌మ్యారో వ్యాధి బాధితుడికి వితరణ



నీరజ్ తల్లిదండ్రులకు చెక్కును అందిస్తున్న హెచ్‌ఎం తదితరులు

రావికమతం : బోన్‌మ్యారో వ్యాధితో బాధపడుతున్న కొత్తకోట హైస్కూల్ పదో తరగతి విద్యార్థి గట్రెడ్డి నీరజ్ వైద్య ఖర్చుల నిమిత్తం కొత్తకోట హైస్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉదారత చాటుకున్నారు. రక్తహీనతతో బాధపడుతున్న నీరజ్ తల్లిదండ్రులకు బుధవారం రూ.74,672 సహాయాన్నందించారు. నీరజ్‌కు రక్తమార్పిడి చేయాల్సి ఉంది. దీనికి రూ.30 లక్షలు వరకూ ఖర్చవుతుంది. ఇటీవల నర్సీపట్నం వచ్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డిని నీరజ్ కలవగా ఆపరేషన్ చేయిస్తామని హామీ ఇచ్చారు. తక్షణ ఖర్చుల నిమిత్తం రూ.లక్ష చెక్కును అందించారు. ఇప్పటి వరకూ అప్పులు చేసి వైద్యం చేయించుకున్న ఆ కుటుంబం ఆర్థికంగా చిదిగిపోవడంతో పలువురు దాతలు ఆర్థిక సహాయం అందిస్తున్నారు. కొత్తకోట హైస్కూల్ ఉపాధ్యాయ బృందం రూ.46,622, విద్యార్థులు రూ.28,050 మొత్తం రూ.74,672 హైస్కూల్ హెచ్ఎంల చేతుల మీదుగా బుధవారం అందించారు.

శిరిజాంలో పూరిల్లు దగ్ధం



శిరిజాంలో పూర్తిగా కాలిపోయిన పూరిల్లు

చీడికాడ: మండలంలో శిరిజాం గ్రామంలో బుధవారం తెల్లవారుజామున జరిగిన అగ్ని ప్రమాదంలో ఒక పూరిల్లు దగ్ధమైంది. గ్రామానికి చెందిన ఓలేటి దేముడుకు చెందిన పూరిల్లు పూర్తిగా కాలిపోయింది. ఈ ప్రమాదంలో దుస్తులు, నిత్యావసర వస్తువులు, కుండలు తయారు చేసే చక్రాలు, పూర్తిగా కాలిపోయి నిరాశ్రయులైనట్టు సర్పంచ్ కన్నూరు సత్యవతి తెలిపారు. ఘటనలో సుమారు రూ.1.50 లక్షలు ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితుడు దేముడు పేర్కొన్నారు. పూర్తిగా నిరాశ్రయులైన దేముడు కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కాంట్రాక్ట్ లెక్చరర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా రాజేష్



రాజేష్‌ను అభినందిస్తున్న కొత్తకోట కాలేజీ ప్రిన్సిపాల్ సాయికుమార్ తదితరులు

రావికమతం: కాంట్రాక్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా కొత్తకోట జూనియర్ కాలేజీ జువాలజీ లెక్చరర్ వి.ఎల్.వి. రాజేష్ ఎన్నికయ్యారు. మూడు జిల్లాల కాంట్రాక్టు లెక్చరర్స్ నూతన కమిటీల ఎన్నికలు విశాఖలో మంగళవారం ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బి.ఎస్.ఆర్. శర్మ ఆధ్వర్యంలో జరిగాయి. అధ్యక్షునిగా రాజేష్, జిల్లా కార్యదర్శిగా ఇదే కాలేజీకి చెందిన హిస్టరీ అధ్యాపకుడు వి.అప్పారావు ఎన్నికయ్యారని అధికారికంగా రాష్ట్ర కమిటీ ప్రకటించినట్టు కొత్తకోట కాలేజీ ప్రిన్సిపాల్ సాయికుమార్ తెలిపారు. నూతనంగా పదవులు పొందిన రాజేష్‌ను,అప్పారావును ప్రిన్సిపాల్, ఇతర అధ్యాపకుల బుధవారం ఘనంగా సన్మానించారు.

జగనన్న కాలనీ లబ్ధిదారుల స్థలాల్లో గ్రావెల్ రోడ్డు

- ప్రైవేట్ లేఅవుట్ నిర్వాహకుల నిర్వాకం



జగనన్న కాలనీలోని లబ్ధిదారుల స్థలాల్లో వేసిన గ్రావెల్ రోడ్డు

కోటవురట్ల : రియల్ ఎస్టేట్ వ్యాపారులు వైఎస్సార్ జగనన్న కాలనీలో లబ్ధిదారుల ఇళ్ల స్థలాలను ఆక్రమించుకుని ప్రైవేటు లే అవుట్‌కు రోడ్డు వేయడంతో లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యండపల్లి శివారున ఎస్సీ కాలనీని ఆనుకుని కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు లే అవుట్ వేసి ఇళ్ల స్థలాల అమ్మకాలు చేపట్టారు. ఈ లే అవుట్‌ను ఆనుకుని సర్వే నంబర్లు 29, 30, 31లలో వైఎస్సార్ జగనన్న కాలనీ లే అవుట్‌ను 8 నెలల క్రితం అధికారులు ఏర్పాటు చేశారు. ఇందులో రావాడ సత్యవతి, కొల్లు సీత, సీరంగ పార్వతి, గొర్లె శ్రీరాములు, జీరెడ్డి పూర్ణమహేశ్వరి అనే లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు కేటాయించి పట్టాలు ఇవ్వడంతో పాటు జియోట్యాగింగ్ కూడా చేశారు. అయితే ఆ ఇళ్ల స్థలాలు అప్పగించకుండా వేరే చోట ఏర్పాటు చేస్తున్నామంటూ 8 నెలలుగా తమను తిప్పిస్తున్నారని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇచ్చినా అధికారుల ధోరణి ఆవేదన కలిగిస్తోందని వాపోతున్నారు. లబ్ధిదారులకు ఇచ్చిన ఇళ్ల స్థలాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారులు తమ లే అవుట్‌కు గ్రావెల్‌తో పక్కా రోడ్డు వేసేశారు. దీనిపై అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. లబ్ధిదారులకు గతంలో కేటాయించిన స్థలాలను యధావిధిగా అప్పగించాలని కోరుతున్నారు.

రోడ్డు తొలగించాలని ఆదేశించాం

వైఎస్సార్ జగనన్న కాలనీలో లబ్ధిదారులకు చెందిన స్థలాల్లో నుంచి రోడ్డు వేసినట్టు గుర్తించాం. వెంటనే రోడ్డు తొలగించి లబ్ధిదారులకు ఆ స్థలాన్ని అప్పగించాలని సిబ్బందికి ఆదేశాలిచ్చాం. – జానకమ్మ, తహసీల్దారు

ఫిర్యాదు అందలేదు

లబ్ధిదారులకు ఇచ్చిన స్థలాల గురించి ఎవరూ ఫిర్యాదు చేయలేదు. విచారణ చేసి లబ్ధిదారులకు పట్టాలు అందేలా చర్యలు తీసుకుంటాం. – చంద్రశేఖర్, ఎంపీడీవో

పశు వైద్య శిబిరానికి విశేష స్పందన



పెదనందిపల్లిలో పశువైద్య శిబిరంలో సేవలందిస్తున్న వైద్య సిబ్బంది

- 62 పశువులకు గర్భకోశ పరీక్ష
- 8 పశువులకు మందగుది శస్త్రచికిత్స



మేకలకు నట్టల నివారణ మందులు తాగిస్తున్న పశువైద్యాధికారులు

దేవరాపల్లి: పెదనందిపల్లిలో పశుగణాభివృద్ధి సంస్థ, పశు సంవర్ధకశాఖ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి బి.ప్రసాదరావు నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏరియా పశువైద్య శాఖ సహాయ సంచాలకులు, శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ బైరాగి 8 పశువులకు మందగుది శస్త్రచికిత్సలు చేశారు. గర్భకోశ చికిత్స నిపుణులు డాక్టర్ బి.భానుబాబు 62 పశువులకు గర్భకోశ పరీక్షలు నిర్వహించి ఖనిజ లవణ మిశ్రమం, మందులు అందజేశారు. నియోజకవర్గ వ్యాధి నిర్ధారణ కేంద్రం సిబ్బంది పశువుల నుంచి పేడ నమూనాలను సేకరించి సూక్ష్మదర్శినితో పరీక్షించి తగు నట్టల నివారణ మందులను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి బి.ప్రసాదరావు మాట్లాడుతూ ప్రతి రైతు తమ పాడి పశువులకు లంపి స్కిన్ టీకాలు తప్పనిసరిగా వేయించాలని చెప్పారు. మూగజీవాలు అనారోగ్యానికి గురైతే అత్యవసర పరిస్థితుల్లో డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ టోల్ ఫ్రీ నంబర్ 1962కు ఫోన్ చేస్తే పశువు ఉన్న ప్రాంతానికి వచ్చి వైద్య సేవలందిస్తారన్నారు. గర్భకోశ వ్యాధులు రాకుండా యాజమాన్య పద్ధతులు, ఎదకురాని పశువులలో తిరిగి పొర్లటం గురించి వివరించారు. నాలుగు నెలల వయసు దాటిన పెయ్యలకు బ్రూసెల్లోసిస్ టీకాలు వేయించాలని సూచించారు. జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఈవో డాక్టర్ రామ్మోహన్‌రావు మాట్లాడుతూ లింగ నిర్ధారణ వీర్యం ఉపయోగించడం ద్వారా 90 శాతం మేర ఆడ పశు పిల్లలను పొందవచ్చునన్నారు. మామిడిపల్లి పశువైద్యాధికారి డాక్టర్ జి.ప్రియాంక మాట్లాడుతూ పశువుల్లో పొదుగు వాపు వ్యాధి, ఖనిజ లవణ మిశ్రమం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక గ్రామ సర్పంచ్ సోమిరెడ్డి సన్నిబాబు, పశువైద్యులు ఎర్రినాయుడు, సంధ్య తదితర పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పంట పొలాల్లో బోల్తాపడిన కారు



పంట పొలాల్లోకి దూసుకుపోయిన కారు



క్షతగాత్రులను 108 వాహనంలో తుని తరలిస్తున్న దృశ్యం

- నలుగురికి గాయాలు

నక్కపల్లి : జాతీయరహదారిపై ఒడ్డిమెట్ట సమీపంలో బుధవారం కారు అదుపు తప్పి రోడ్డుపక్కన ఉన్న పంట పొలాల్లోకి దూసుకుపోయి బోల్తాపడింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న నలుగురు గాయపడ్డారు. వీరిలో ఇద్దరికి కాళ్లు విరిగిపోయాయి. సమాచారం తెలుసుకున్న 108 వాహన సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని ప్రాథమిక చికిత్స అందించి క్షతగాత్రులను తుని ఏరియా ఆస్పత్రికి తరలించారు. వివరాలు ఇలా ఉన్నాయి. రాజమండ్రి నుంచి విశాఖ వెళ్తున్న కారు ఒడ్డిమెట్ట–గొడిచర్ల మధ్యలో అదుపు తప్పి పంటపొలాల్లోకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న రాజమండ్రికి చెందిన కోటేశ్వరరావు, ఎం.సూర్యకుమారి, ఉత్తమ్ శ్రీరామ్, వెన్న సుహాసిని తీవ్రంగా గాయపడ్డారు. వారిని చికిత్స కోసం తుని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పొలాల్లోకి కారు పల్టీలు కొట్టడం చూసిన స్థానికులు వెంటనే ఘటనా స్థలానికి వచ్చి కారులో చిక్కుకుపోయిన వారిని బయటకు తీశారు. 108 వాహనానికి సమాచారం ఇవ్వడంతో ప్రాథమిక చికిత్స అందించి, తుని ఆస్పత్రికి తరలించారు. కారు రోడ్డుపై నుంచి 100 అడుగుల దూరంలో ఉన్న పొలాల్లోకి దూసుకుపోయి కల్వర్టును ఢీకొట్టి నిలిచిపోయింది.

ఉత్తరాంధ్ర అభివృద్ధిపై అఖిలపక్ష సమావేశం

- సీఎంకు కొణతాల రామకృష్ణ విజ్ఞప్తి

అనకాపల్లి టౌన్: ఉత్తరాంధ్ర అభివృద్ధిపై, ఈ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై ప్రజాసంఘాలు, వివిధ రాజకీయ పక్షాలతో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని మాజీ మంత్రి, ఉత్తరాంధ్ర చర్చావేదిక కన్వీనర్ కొణతాల రామకృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు ఆయన బుధవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. ఆ వివరాలను ఆయన విశాఖలో వెల్లడించారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి ప్రభుత్వం ముందు ఉన్న కార్యాచరణ, ప్రణాళికలను చర్చించాలని కోరారు. ఈ బడ్జెట్ సమావేశాల సందర్భంగా ప్రవేశపెట్టే గవర్నర్ ప్రసంగంలో, బడ్జెట్ ప్రసంగంలో ప్రత్యేకంగా ప్రస్తావించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి హయాంలో ఏర్పాటు చేసిన ఉత్తరాంధ్ర అభివృద్ధి మండలిని పునరుద్ధరించాలని కోరారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను అడ్డుకోవాలన్నారు.

అప్పన్నను దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి రవి



జస్టిస్ రవికి జ్ఞాపికను అందజేస్తున్న పురోహిత్ అలంకారి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని బుధవారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి కుటుంబసమేతంగా దర్శించుకున్నారు.ఆలయంలోని కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడా మండపంలో ప్రదక్షిణ చేశారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు. ఆలయసంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని, జ్ఞాపికను ఆలయ పురోహిత్ అలంకరా కరి సీతారామాచార్యులు న్యాయమూర్తికి అందజేశారు.

రేపటి నుంచి టన్నెల్ అక్వేరియం ప్రదర్శన





ఏర్పాటు చేయనున్న అక్వేరియం, వివరాలు తెలియజేస్తున్న నిర్వాహకుడు రాజారెడ్డి

- బీచ్ రోడ్డులోని ఏయూ మైదానంలో ఏర్పాటు
- విభిన్న జాతుల చేపలతో కనువిందు

ఏయూ క్యాంపస్: బీచ్‌రోడ్డులోని పోలీస్ మెస్ వెనుకనున్న ఏయూ మైదానంలో అండర్ వాటర్ టన్నెల్ అక్వేరియంతో పాటు హ్యాండ్‌లూమ్, హ్యాండీ క్రాఫ్ట్ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు నిర్వాహకుడు రాజారెడ్డి తెలిపారు. బుధవారం సాయంత్రం ఎగ్జిబిషన్ వేదికగా ఆయన విలేకరులతో మాట్లాడారు. విదేశాలలో చూసే టన్నెల్ అక్వేరియంను తొలిసారిగా విశాఖ ప్రజలకు అందుబాటులోకి తెస్తున్నామన్నారు. వందల జాతులకు చెందిన చేపలు కనువిందు చేస్తాయన్నారు. శుక్రవారం నుంచి ఎగ్జిబిషన్ ప్రారంభమవుతుందని, సుమారు మూడు నెలల పాటు అందుబాటులో ఉంటుందని చెప్పారు. దీని పర్యవేక్షణ కోసం ప్రత్యేకంగా నిపుణులైన సిబ్బంది నిరంతరం పని చేస్తారన్నారు. ఎమ్యూజిమెంట్ పార్క్‌లో గతంలో లేని విధంగా సునామీ, డ్రీమింగ్ టవర్, టెక్నోజంప్ వంటి 15 రైడ్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. వీటితో పాటు వందకుపైగా వస్త్ర, అలంకరణ, హస్తకళ ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయాలు ఉంటాయని ఆయన తెలిపారు.

ప్రభుత్వ కంటి ఆస్పత్రిలో కార్పొరేట్ వైద్య సేవలు

- కలెక్టర్ నిధులతో ఆస్పత్రికి నిరంతరం విద్యుత్ సరఫరా
- హెచ్‌పీసీఎల్ సీఎస్సార్ నిధులు రూ.కోటి మంజూరు
- ఆస్పత్రి సూపరింటెండెంట్ విశ్వామిత్ర



మాట్లాడుతున్న విశ్వామిత్ర

సీతంపేట(విశాఖ ఉత్తర): ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆస్పత్రికి సమకూరనున్న అత్యాధునిక పరికరాలతో కార్పొరేట్ వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయని ఆస్పత్రి సూపరింటెండెంట్ విశ్వామిత్ర తెలిపారు. స్థానిక రామాటాకీస్ రోడ్‌లో ఉన్న ఆస్పత్రిలో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగానికి ప్రాధాన్యమిస్తూ ప్రభుత్వ ఆస్పత్రుల్లో కార్పొరేట్ స్థాయిలో మెరుగైన వైద్య సేవలు అందించడానికి చర్యలు చేపడుతున్నారన్నారు. దీనిలో భాగంగా కలెక్టర్ మల్లికార్జున మంజూరు చేసిన రూ.25 లక్షల నిధులతో ఆస్పత్రిలో నిరంతర విద్యుత్ సరఫరాకు అవసరమైన 250 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, 620 కేవీ జనరేటర్ ఏర్పాటు చేశామని చెప్పారు. దీంతో ఆస్పత్రిలో ఆపరేషన్ థియేటర్లు, ఓపీ, వార్డుల్లో నిరంతర విద్యుత్ సరఫరా సౌకర్యం లభించిందన్నారు. అలాగే కంటి పరీక్షలకు ఉపయోగించే మూడు స్లిట్‌ల్యాంపులు సమకూరాయని, వీటిని త్వరలో కలెక్టర్‌తో ప్రారంభిస్తామన్నారు.

హెచ్‌పీసీఎల్ నిధులతో ఆధునిక పరికరాలు

కలెక్టర్ చొరవతో హెచ్‌పీసీఎల్ కంపెనీ సీఎస్సార్ కింద ఆస్పత్రి అభివృద్ధికి కోటి రూపాయల నిధులు మంజూరు చేసినట్టు విశ్వామిత్ర తెలిపారు. రూ.28 లక్షలతో గ్లకోమా వ్యాధిగ్రస్తుల్లో దృష్టి సామర్థ్యాన్ని అంచనా వేసే అత్యాధునిక 'విజువల్ ఫీల్డ్ ఎనలైజర్'కొనుగోలు చేస్తున్నట్టు తెలిపారు. రెటీనా సంబంధిత ఆపరేషన్స్, క్యాటరాక్ట్ ఆపరేషన్స్ నిర్వహించడానికి అవసరమైన ఫేకో మిషన్‌ను రూ. 60 లక్షలతో కొనుగోలు చేస్తున్నామన్నారు. రూ.15 లక్షలతో స్పెషల్ మైక్రో స్కోప్ అందుబాటులోకి తెస్తున్నట్టు తెలిపారు. కొద్ది రోజుల్లో సమకూరనున్న ఈ పరికరాలతో కార్పొరేట్ ఆస్పత్రుల్లో లభిస్తున్న ఎంతో ఖరీదైన వైద్య సేవలు ప్రభుత్వ కంటి ఆస్పత్రిలో 90 శాతం వరకు అందుబాటులోకి వస్తాయన్నారు.

త్వరితగతిన వైద్య సేవలు

ఆస్పత్రికి వచ్చే రోగులకు త్వరితగతిన వైద్య సేవలు అందేలా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్టు ఆమె తెలిపారు. ఆపరేషన్ చేయించుకున్న వారికి పోస్ట్ ఆపరేషన్ టెస్టుల కోసం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కౌంటర్‌లో స్పెషలిస్ట్ వైద్యులు, స్లిట్ ల్యాంప్ అందుబాటులో ఉంటుందని, దీనివల్ల అర్ధ గంటలో వైద్య పరీక్షలు పూర్తి చేసి పంపిస్తామన్నారు.

సెకండ్ ఒపీనియన్ సేవలు

కంటి వైద్యానికి సంబంధించి సర్జరీలు, వైద్య పరీక్షల విషయంలో రోజూ ఎంతో మంది సలహాలు, సూచనల కోసం ఆస్పత్రికి వస్తుంటారని సూపరింటెండెంట్ తెలిపారు. అటువంటి వారి కోసం ప్రతి శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రతి స్పందన సేవలు అందిస్తామన్నారు. నిపుణులైన వైద్యులు సెకండ్ ఒపీనియన్ సేవలు, సలహాలు ఇస్తారన్నారు.

టెక్స్‌టైల్ డిజైనర్, క్లస్టర్ డెవలప్‌మెంట్ పోస్టులకు దరఖాస్తులు

తుమ్మపాల: జాతీయ చేనేత అభివృద్ధి పథకంలో టెక్స్‌టైల్ డిజైనర్, క్లస్టర్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్‌లుగా పనిచేయడానికి అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు చేనేత జౌళి శాఖ అధికారి రమణి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో పాయకరావుపేటలో పనిచేయడానికి రెండు పోస్టులు ఉన్నాయని, హ్యాండ్‌లూమ్ టెక్నాలజీలో డిప్లొమా కలిగి రెండు సంవత్సరాల అనుభవం ఉండాలన్నారు. కంప్యూటర్ పరిజ్ఞానం ఉండి ఖాతా పుస్తకాల నిర్వహణ బాధ్యతలు చేపట్టాలన్నారు. అర్హత, అనుభవం, వయస్సు, నివాసం ఆధారంగా ఎంపిక చేస్తామన్నారు. తాత్కాలిక ప్రాతిపదికన మూడు సంవత్సరాల వరకు నెలకు రూ.30 వేల కన్‌సాలిడేటెడ్ పారితోషికం ఉంటుందన్నారు. రాష్ట్రంలో విజయనగరం, నంద్యాల, తూర్పుగోదావరి, పార్వతీపురం జిల్లాల్లో కూడా ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. ప్రకటన వెలువడిన తేదీ నుంచి 21 రోజులలోగా 'కమిషనర్ చేనేత, జౌళి శాఖ నాల్గవ అంతస్తు, ఐహెచ్‌సీ కార్పొరేట్ బిల్డింగ్, ఆటోనగర్, మంగళగిరి–522503, గుంటూరు జిల్లా' చిరునామాకు దరఖాస్తు సమర్పించాలన్నారు.

క్లుప్తంగా

శ్రీవారి అవతారంలో శ్రీరాముడు



అనకాపల్లిటౌన్ : స్థానిక రింగ్‌రోడ్డు శ్రీరామమందిరంలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీరామచంద్రుడు శ్రీవారి అవతారంలో దర్శనమిచ్చారు. భక్తులు స్వామి వారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

అనకాపల్లిటౌన్ : పట్టణంలోని రహదారి క్రాసింగ్ ప్రాంతంలో 11కేవీ విద్యుత్ తీగల మార్పు కారణంగా కొన్ని ప్రాంతాల్లో గురువారం విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ విభాగం ఏఈ ఎం.శ్రీనివాసరావు బుధవారం పేర్కొన్నారు. నరసింగరావుపేట, చవితినవీధి, జీవీ నూకేశ్వరరావు వీధి, దుర్గాలాడ్జివీధి, జీవీఎంసీ ఏరియా తదితర ప్రాంతాల్లో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఘనంగా ప్రపంచ హిందీ దినోత్సవం



ప్రతిజ్ఞ చేస్తున్న సింహాద్రి ఎన్టీపీసీ అధికారులు

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ హిందీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సంస్థ జీజీఎం సంజయ్ కుమార్ సిన్హా మాట్లాడుతూ అధికార భాష హిందీని రోజు వారీ పనుల్లో గరిష్టంగా ఉపయోగించాలని సూచించారు. ఆపరేషన్ జీఎం డీపీ పాత్రో హిందీ వినియోగంపై సంస్థ ప్రధాన అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. హెచ్‌ఆర్ ఏజీఎం రుమాడీ శర్మ హిందీ దినోత్సవం ప్రాముఖ్యతను వివరించారు. ప్రపంచ హిందీ దినోత్సవంలో భాగంగా దీపిక లేడీస్ క్లబ్ సహకారంతో అంత్యాక్షరి పోటీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన ఆన్‌లైన్ హిందీ క్విజ్‌లో ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

యాచకురాలు మృతి

అనకాపల్లిటౌన్ : విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ యాచకురాలు బుధవారం మృతి చెందింది. సీఐ డి.మోహన్ అందించిన వివరాలు.. ఈ నెల 8న అపస్మారక స్థితిలో ఉన్న బిచ్చగత్తెను స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంలో చేర్పించారు. మెరుగైన చికిత్స కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందినట్టు సీఐ తెలిపారు.

బెల్లం ధరలు

అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు బుధవారం 8,391 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్	3,770	4,000
మొదటి రకం	2,980	3,400
రెండో రకం	2,810	2,970
మూడో రకం	2,600	2,770

అనకాపల్లి సినిమాలు

ధమాకా	-రాజా
వీర సింహారెడ్డి	-సత్యనారాయణ స్క్రీన్-1
వీర సింహారెడ్డి	-సత్యనారాయణస్క్రీన్-2
18 పేజెస్	-షిర్డిసాయి
అవతార్-2	-పర్తిసాయి
వీర సింహారెడ్డి	-వెంకటేశ్వర
లవ్ టుడే	-శ్రీసత్య
వీర సింహారెడ్డి	-రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 119 యూనిట్లు రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-17 యూనిట్లు, ఏ నెగిటివ్-2 యూనిట్లు, బీ పాజిటివ్-34 యూనిట్లు, బీ నెగిటివ్-1 యూనిట్, ఓ పాజిటివ్-57 యూనిట్లు, ఏబీ పాజిటివ్-07 యూనిట్లు, ఏబీ నెగిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంక్ ప్రతినిధి గంగయ్య(9182834480)ని సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 456 మంది వినియోగదారులు గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న 398 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

రైతాంగం చూపు మొక్కజొన్న వైపు

- లాభదాయకంగా సాగు
- 100 రోజుల్లో పంట దిగుబడి
- ఎకరాకు రూ.30 వేలకు పైగా ఆదాయం
- రబీ సాగులో రైతుల ఆసక్తి



అక్కిరెడ్డిపాలెంలో కోత దశకు వచ్చిన స్వీట్ కార్న్ మొక్కలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

అనకాపల్లి రూరల్ : వాణిజ్య పంటల సాగుతో అధిక లాభాలు ఆశిస్తున్న రైతులు మొక్కజొన్న వైపు ఆసక్తి చూపుతున్నారు. గతంలో ఖరీఫ్ సీజన్‌లో మొక్కజొన్న సాగు చేసి రబీలో విరామం ఇచ్చేవారు. సాగులో మెలకువలు, రైతు భరోసా కేంద్రాల నుంచి ఇస్తున్న సహకారంతో పాటు సకాలంలో వర్షాలు కురవడంతో రైతులు రబీలోనూ మొక్క జొన్న సాగుపై దృష్టి సారించారు.

వంద ఎకరాల్లో సాగు

అనకాపల్లి వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో దేశవాళీ మొక్క జొన్నతో పాటు, స్వీట్‌కార్న్ సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. మండలంలోని అక్కిరెడ్డిపాలెం గ్రామంలో అక్కిరెడ్డి సంతోషి అనే మహిళా రైతు సుమారు ఎకరం విస్తీర్ణంలో స్వీట్ కార్న్ సాగు చేపడుతున్నారు. మండలంలో దాదాపు 100 ఎకరాల్లో మొక్కజొన్న పంటను రైతులు వేశారు. తక్కువ పెట్టుబడితో తొందరగా చేతికొచ్చే పంటగా మొక్కజొన్నను రైతులు ఎంచుకున్నారు. ఎకరానికి రూ.20 వేల వరకూ పెట్టుబడి ఖర్చులు కాగా, దాదాపు 30 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని రైతులు చెప్తున్నారు. గిట్టుబాటు ధర క్వింటాళ్లకు రూ.2 వేలకు పైగా ఉండటంతో మొక్కజొన్న సాగు బాగా కలిసొస్తోందని రైతులు పేర్కొంటున్నారు.

పెట్టుబడి తక్కువ.. రాబడి ఎక్కువ

మొక్కజొన్న విత్తనం నాటకముందు ఎకరానికి 10 బస్తాలు చొప్పున ఎరువులు చల్లాలి. 10 నుంచి 12 రోజుల వ్యవధిలో సాగునీరందించాలి. గడ్డి ఉంటే విత్తనాలు నాటిన 15 రోజుల్లో గడ్డి మందు పిచికారీ చేయాలి. రబీలో ఎక్కువ శాతం బోర్లున్న చోటే మొక్కజొన్న పంటను సాగు చేస్తున్నారు. ప్రభుత్వం కల్పించిన మద్దతు ధరకంటే బహిరంగ మార్కెట్లో ధర ఎక్కువగా పలుకుతోంది. ప్రైవేట్ వ్యాపారులు గిట్టుబాటు ధర కంటే ఎక్కువ ధరకు రైతుల నుంచి పంటను కొనుగోలు చేస్తుండడంతో మళ్లీ అదే పంటను సాగు చేసేందుకు రైతులు మొగ్గు చూపుతున్నారు. 100 రోజుల్లో పంట చేతికి రావడం, నీటి వినియోగం తక్కువగా ఉండటం, పెట్టుబడి పెద్దగా లేకపోవడంతో ఈ సాగు బాగుందని రైతులు చెబుతున్నారు. సాధారణంగా మొక్కజొన్న పంటకు కత్తెర పురుగు వ్యాపించి నష్టం కలుగుజేస్తుంది. అయినా రైతులు ఆర్బీకేలు, వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలతో సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపడుతూ పంటను రక్షించుకుంటున్నారు.

రైతులు మక్కువ చూపుతున్నారు



మొక్కజొన్న సాగుపై రైతులు మక్కువ కనబరుస్తున్నారు. దేశవాళీతో పాటు, స్వీట్‌కార్న్ కూడా సాగు చేస్తున్నారు. అపరాల సాగుకు బదులుగా మొక్కజొన్న సాగుపై రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. వాతావరణం అనుకూలించడం, పెట్టుబడి పెద్దగా లేకపోవడం కూడా ఇందుకు ఓ కారణం. అన్ని గ్రామాల్లోనూ ఈ క్రాప్ నమోదు చేస్తున్నాం. వేసిన ప్రతీ పంటనూ రైతులు ఈ క్రాప్‌లో నమోదు చేయించుకోవాలి.

– ఎం.రామారావు, అసిస్టెంట్ డైరెక్టర్, వ్యవసాయ శాఖ

ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో చోరీలకు చెక్



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ నరసింగరావు

అనకాపల్లిటౌన్ : పండగలకు ఇతర ప్రదేశాలకు వెళ్లేవారు తమకు సమచారమివ్వాలని గ్రామీణ ఎస్ఐ నరసింగరావు తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ఆయన పర్యటించి చోరీలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అంతకుముందు చోరీల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒంటరి ఇళ్లు, అపార్ట్‌మెంట్లలో వాచ్‌మన్ కాపలా లేనివారు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాంటి వారు ముందుగానే తమకు సమాచారమందిస్తే, వారింటి భద్రతను పోలీస్ యంత్రాంగమే చూసుకుంటుందని భరోసానిచ్చారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో చాలా వరకు నేరాలను నియంత్రించినట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

మకరజ్యోతి వేడుకల కరపత్రం ఆవిష్కరణ



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న మద్దాల నారాయణరావు, అర్చకులు, పాలకవర్గ సభ్యులు

అనకాపల్లిటౌన్ : గవరపాలెం గౌరీ పంచాయతన దేవస్థానంలో అయ్యప్పస్వామి మకరజ్యోతి దర్శన వేడుకలు ఘనంగా నిర్వహించనున్నామని ఆలయ ప్రధాన గురుస్వామి మద్దాల నారాయణరావు తెలిపారు. ఆలయ ఆవరణలో సదరు వేడుకల కరపత్రాన్ని బుధవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది భక్తుల ద్వారా లభించిన బంగారంతో స్వామివారికి బంగారు వజ్రకవచ అలంకరణ చేయనున్నట్టు వెల్లడించారు. ఉత్తరాంధ్రలో మొట్టమొదటిసారిగా ఆలయ ఆవరణలో ఈ నెల 14, 15 తేదీల్లో మకరజ్యోతి వేడుకలతోపాటు స్వామివారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. వంద తులాల బంగారు ఆభరణాలతో స్వామివారి ఊరేగింపు తర్వాత మకరజ్యోతి దర్శనం ఉంటుందన్నారు. ఈ ఊరేగింపులో కేరళ వాయిద్యాలు, మహిళల దాండియా నృత్యం, పులివేషాలు, తప్పెటగుళ్లు, కాంగో కోలాటం తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు పొందూరు సూర్యనారాయణశాస్త్రి, శేషసాయి, ఆలయ అధ్యక్షుడు బొడ్డేడ సన్యాసినాయుడు, కార్యదర్శి బుద్ధ రమణాజీ, కోశాధికారి కర్రి శివ సూర్యనారాయణ, ఆలయ కన్వీనర్ పెంటకోట ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా మేలుకొలుపు



నాయుడుపాలెం పల్లకి సేవలో పాల్గొన్న భక్తులు

పరవాడ: సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరవాడ, నాయుడుపాలెం, వాడచీపురుపల్లి, రావాడ, లంకెలపాలెం, వెన్నలపాలెం గ్రామాల్లో రామాలయాల కేంద్రంగా భక్తులు మేలు కొలుపు కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ప్రతీ రోజు ఉదయం భగవంతుని నామ స్మరణ చేస్తూ, భజన గీతాలు ఆలపిస్తూ గ్రామాల్లో ర్యాలీలు చేపడుతున్నారు. ఆధ్యాత్మిక భావం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ నెల 12న స్వామి వివేకానంద జయంతిని పంచాయతీల కేంద్రంగా నిర్వహించాలని మండల ధార్మిక కమిటీ తెలిపింది. కార్యక్రమంలో సబ్‌డివిజన్ ధర్మ ప్రచారక్ వెన్నల అప్పలనాయుడు, మాజీ ఎంపీపీ ఎం.అప్పలనాయుడు, నాయుడుపాలెం సర్పంచ్ కె.వరలక్ష్మి సీతారామయ్య, మాజీ ఎంపీటీసీ కె.శ్రీరామ్మూర్తి, కమిటీ సభ్యులు ఎం.నాగేశ్వరరాజు, వి.అప్పలరాజు, సీహెచ్.అప్పారావు, కె.శ్రీనివాసరావు, దుంగల అప్పారావు, బి.బాబూరావు పాల్గొన్నారు.

కన్నుల పండువగా కూడారై ఉత్సవం



కశింకోటలోని వేణుగోపాలస్వామి ఆలయంలో స్వామి వారికి పూజలు చేస్తున్న అర్చకుడు



ప్రసాద వితరణ చేస్తున్న అర్చకులు

కూడారై వెల్లుమ్ శీర్ గోవిందా(గోప గోపీజన సంరక్షకా.. నీ కల్యాణ గుణాలు ఎంత గొప్పవంటే.. నిన్ను వద్దనుకున్న, నీ దరికి రాని వారిని కూడా జయించి నీదరికి రప్పించుకునేంత) అంటూ భక్తులు బుధవారం వైష్ణవాలయాల్లో కూడారై ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీరంగనాథుని భర్తగా పొందేందుకు ఆండాళ్(గోదాదేవి) అమ్మవారు ఆచరించిన ధనుర్మాస వ్రతంలో 27వ రోజుకు ప్రత్యేకత ఉంది. ఇదే రోజున విష్ణుచిత్తుని కలలో శ్రీరంగనాథుడు కనిపించి వివాహానికి అంగీకారం తెలిపినట్టు పురాణ ప్రతీతి. దీంతో బుధవారం గ్రామాల్లోని వైష్ణవాలయాలు తిరుప్పావై పాశుర పఠనంతో హోరెత్తాయి.

కశింకోట : కశింకోటలోని దేవాదాయ శాఖకు చెందిన రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో బుధవారం కూడారై ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామిని అలంకరించి పంచామృత స్నానం చేయించి విష్ణు సహస్ర నామాలతో అర్చించారు. తిరుప్పావై పఠనం చేశారు. రెండు పెద్ద పాత్రలతో వేర్వేరుగా పాయసాన్ని తయారు చేసి, స్వామి వారికి నివేదించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రేజేటి శ్రీరామాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు రేజేటి సీతారామాచార్యులు, మారుతి తదితరులు ఈ పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

- శివాలయం వద్ద ధ్యాన వేంకటేశ్వరస్వామి ఆలయంలో కూడా ధనుర్మాసోత్సవాల్లో భాగంగా కూడారై ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విష్ణుమూర్తి దశావతారాల్లో ఒకటైన బుద్ధ అవతారంలో ఉన్న స్వామికి విష్ణు సహస్ర నామ అర్చన, పాశుర పఠనం చేశారు. పాయసాన్ని నివేదించి పూజలు చేసి భక్తులకు పంపిణీ చేశారు. ఆలయ అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు.
- స్థానిక గవరపేటలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా స్వామిని విష్ణుమూర్తి దశావతారాల్లో ఒకటైన రామావతారంలో అలంకరించి పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ వ్యవస్థాపక ధర్మకర్త బీశెట్టి దుర్గానాగేశ్వరరావు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.



గవరపేటలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో రామావతారంలో స్వామివారు

అంగన్‌వాడీల ధర్నా



ఆర్వోకు వినతిపత్రం అందిస్తున్న సిటు ప్రతినిధులు

పరవాడ: అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ(సిటు) నాయకురాలు సీహెచ్ దేవి డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీలకు కనీస వేతనం నెలకు రూ.26 వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

నైపుణ్యం ఉంటేనే రాణింపు

ఎన్టీపీసీ జీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా



వింటర్ వర్క్‌షాపును ప్రారంభిస్తున్న సిన్హా

పరవాడ: విద్యార్థులు తమ భవిష్యత్ ఉజ్వలంగా మారేలా నైపుణ్యం పెంపొందించుకోవడానికి కృషి చేయాలని సింహాద్రి ఎన్టీపీసీ జీజీఎం సంజయ్ కుమార్ సిన్హా పిలుపునిచ్చారు. దీపాంజలినగర్‌లోని బాల భారతి పబ్లిక్ స్కూల్లో ఏర్పాటు చేసిన శీతాకాలపు వర్క్‌షాపును బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ రంగాల్లో నైపుణ్యం పెంపొందించుకోవడంపై విద్యార్థులు దృష్టిసారించాలన్నారు. సాఫ్ట్ స్కిల్స్ అభివృద్ధి, కెరీర్ ఎంపికలో మార్గ నిర్దేశం సంస్థ లక్ష్యంగా పెట్టుకుందన్నారు. భవిష్యత్‌లో విద్యార్థులు మంచి విజయాలు సాధించాలని సిన్హా ఆకాంక్షించారు. కార్యక్రమంలో భాగంగా దీపిక లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు అంజు సిన్హా విద్యార్థులకు యోగా మ్యాట్‌లు, స్టేషనరీ కిట్లు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ సీనియర్ అధికారులు, దీపిక లేడీస్ క్లబ్ సభ్యుల బృందం, బాల భారతి పబ్లిక్ స్కూల్ అధ్యాపకులు పాల్గొన్నారు.

ముందే వచ్చిన సంక్రాంతి



ప్రశాంతినికేతన్ స్కూల్లో భోగిమంట సందడి



కొత్త తలారివానిపాలెం పాఠశాల విద్యార్థులు



సంప్రదాయ వేషధారణలో స్కూల్ విద్యార్థులు



విద్యార్థుల నృత్య ప్రదర్శన

అనకాపల్లిటౌన్ : పట్టణ, మండల పరిధిలోని పలు విద్యాసంస్థల్లో బుధవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. స్థానిక పూడిమడక రహదారిలో ఉన్న ప్రశాంతినికేతన్ స్కూల్ ఆవరణలో జరిగిన వేడుకల్లో కరస్పాండెంట్ డీవీ శ్రీనివాసరావు సంక్రాంతి ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థినులు, మహిళా ఉపాధ్యాయులు వేసిన రంగవల్లులు ఆకట్టుకున్నాయి. విద్యార్థులు సంప్రదాయ వస్త్రధారణలో ఆకట్టుకున్నారు. హరిదాసులు, గోదాదేవి అలంకరణలో భోగిమంట వేసి, గాలిపటాలు ఎగురవేసి సందడి చేశారు.

కొత్త తలారివానిపాలెంలో...

మండలంలోని కొత్త తలారివానిపాలెం ఎంపీపీ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. హరిదాసు, బుడబుక్కలవాడు, డూడూ బసవన్న, జంగమదేవర వేషధారణలో విద్యార్థులు అలరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రెడ్డి నారాయణరావు, మహిళా ఉపాధ్యాయురాలు జె.ఉషాకుమారి, స్కూల్ కమిటీ చైర్మన్ నారపిన్ని బాబూరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

- స్థానిక డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం సంక్రాంతి సంబరాలు కన్నుల పండువగా జరిగాయి. కళాశాల ఆవరణలో విద్యార్థులకు పిండివంటలు, కుండ పెయింటింగ్, స్లో సైక్లింగ్ తదితర అంశాల్లో పోటీలు జరిగాయి. విజేతలైన విద్యార్థులకు కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ చల్లా నర్సింహం వైస్ ప్రిన్సిపాల్ ఆర్.వెంకటరావు, డీన్ ఈశ్వరరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.
- జీవీఎంసీ లక్ష్మీదేవిపేట పాఠశాలలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా రంగవల్లుల పోటీలు జరిగాయి. విజేతలైన విద్యార్థులకు ఉపాధ్యాయుడు కృష్ణంరాజు బహుమతులు అందజేశారు.
- స్థానిక జీవీఎంసీ కో ఆపరేటివ్ సొసైటీ ఆవరణలో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా జెడ్పీ ఎస్.వెంకటరమణ సంఘ సభ్యులకు నూతనవస్త్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘ వ్యవస్థాపకుడు పాత్రుపల్లి వీరుయాదవ్, సభ్యులు పాల్గొన్నారు.
- ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో భోగి, సంక్రాంతి, కనుమ పండగలను చేసుకోవాలని జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, 83వ వార్డు కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి అన్నారు. స్థానిక జీవీఎంసీ వేల్పులవీధి బాలికోన్నత పాఠశాలలో బుధవారం సంక్రాంతి సంబరాలు జరిగాయి. ముందుగా కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి, రమేష్ దంపతులు, ఎంఈవో దివాకర్ భోగిమంట వెలిగించి వేడుకల్ని ప్రారంభించారు. అంతకుముందు విద్యార్థినులకు రంగవల్లుల పోటీలు నిర్వహించారు. విజేతలకు కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రుధిరారాణి, వైఎస్సార్‌సీపీ నాయకులు బొండా శంకరరావు, ఉగ్గిన అప్పారావు, బండి ఆనంద్, నడుపూరి శ్రీనివాసరావు, కొంకి శ్రీరామమూర్తి, జి.గణేష్, బొండా వాసు, ఎం.గణేష్, రామారావు పాల్గొన్నారు.



భోగిమంట వెలిగిస్తున్న కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి, రమేష్ దంపతులు, ఎంఈవో దివాకర్

కశింకోట : స్థానిక సెయింట్ జాన్స్ స్కూల్లో బుధవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. విద్యార్థులు సంప్రదాయ వస్త్రాలు ధరించి, వివిధ రంగులతో రంగవల్లులు తీర్చిదిద్ది గొబ్బెమ్మలు అలంకరించారు. భోగి మంటలు వేశారు. పలు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్ బత్తుల నోబుల్‌కుమార్, కరస్పాండెంట్ బత్తుల అనూరాధ మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు అనుగుణంగా, కుల మతాలకు అతీతంగా స్నేహ భావంతో పండగలు జరుపుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.



రంగవల్లులు వేస్తున్న విద్యార్థినులు, మహిళా ఉపాధ్యాయులు



పిండివంటకాలు చేస్తున్న డైట్ కళాశాల విద్యార్థినులు



దివ్యాంగుడికి నూతన వస్త్రాలు అందిస్తున్న జెడ్పీ వెంకటరావు

పురాణ, ఇతిహాసాల పఠనంతో భారతీయత



వక్తృత్వ పోటీల విజేతలతో తెలుగు భాష పరిరక్షణ సమితి ప్రతినిధులు

అనకాపల్లి రూరల్: మండలంలోని తుమ్మపాల జెడ్పీ హైస్కూల్‌లో బుధవారం పురాణ, ఇతి హాసాలపై పిల్లలకు అవగాహనా సదస్సు నిర్వహించారు. అనకాపల్లి తెలుగుభాష పరిరక్షణ సమితి కో ఆర్డినేటర్ కొయిలాడ రామ్మోహన్‌రావు మాట్లాడుతూ మన ఇతిహాసాలైన రామాయణ, భారతాలను పిల్లలు తప్పనిసరిగా చదివేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు. దీని వల్ల తెలుగుభాషపై పూర్తి పట్టు లభిస్తుందన్నారు. అప్పటి ఆచారాలు, ధర్మాల గురించి తెలుసుకునే అవకాశం కలుగుతుందన్నారు. ఆగస్టులో రూ.10 వేల నగదు బహుమతితో మహాభారతంపై విస్తృతమైన పోటీ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. వేసవి సెలవుల్లో పిల్లలందరూ బాగా చదవాలన్నారు. పెద్దలు శిష్టా తమ్మిరాజు, మాధవి సనారా, రేగులగడ్డ గాయత్రి రామాయణ, మహాభారతాల ప్రాముఖ్యతను పిల్లలకు వివరించారు. రామాయణంలో నీకు నచ్చిన పాత్ర అనే అంశంపై నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో పిల్లలు ఆంజనేయుడు, లక్ష్మణుడు, శ్రావణ కుమారుడు, సుగ్రీవుడు, సీత, దశరథుడి గురించి మాట్లాడారు. ఇందులో ఉప్పు సుస్మిత, పీఎం ప్రణతి, వి.వాసవి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు పొందారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం హేమలత, ఉపాధ్యాయులు వాసా రమణి, వెంకటరమణ, నాయుడు, జగన్ పాల్గొన్నారు.